# వైరాగ్యం !

మంత్రిగారి పాపులర్ నేమ్! 'సూట్‌కేస్ మినిస్టర్'! చాలా మందికి అసలు పేరేమిటో తెలీదు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుండి పాపాల పాపారావ్ వుర్ఫ్ 'సూట్‌కేస్ మినిస్టర్' అభ్యుదయ వాదిగ పెద్దల వెంట తిరిగి.. పార్టీ జండాలు మోసి.. నినాదాలు చేసి అందరి కళ్లల్లో పడ్డాడు. బ్రిటిష్ వారి చేత లాఠీ దెబ్బలు తిన్నాడు. జైలు జీవితం అనుభవించి స్వాతంత్ర్య సమర యోధుడయ్యాడు.

పార్టీలో సభ్యత్వంతో పాటు దేశంలో జరిగిన తొలిసారి ఎన్నికల్లో పోటీ చేయటానికి ఎం.పి. టికెట్టు లభించింది.

ఆ రోజుల్లో ఓట్లు కొనుక్కోవటాలు... బేలెట్ బాక్సులు తారు మారు చేయటాలు...రిగ్గింగ్‌ల వంటి దురాచారాలు, సారా పాకెట్ల పంపిణీ, దళారుల దిగుమింగుళ్లు వంటివి లేకపోవటాన పాపాల పాపారావ్ అత్యధిక మెజారిటీతో ఎన్నికల్లో విజయం సాధించాడు. అట్లాంటి ఇట్లాంటి విజయం కాదు. అఖండ విజయం పొందేడు.

ఎం.పి.గా ఎన్నికైన తొలిసారే పాపాల పాపారావుకి కేబినెట్ హోదా మంత్రి పదవీ దక్కింది! తన విజయానికి లోలోన తెగ సంబరపడ్డాడు.

పాపాల పాపారావు అదృష్టవశాత్తు ముగ్గురు భార్యలు (రెండు అనధికారికంగ) పన్నెండు మంది సంతానం (అందులో అరడజను మంది ఆడపిల్లలు).

మినిస్టర్ అయింది లాగాయితు చేతులు ఊపుకుంటూ నడవడం పోయి... చేతికి ఇంపోర్టెడ్ సూట్‌కేసొచ్చింది. అది ముద్దుగ అందంగ వుండటంతో దాన్ని విడిచి క్షణమైనా వుండబుద్ధి అయ్యేదికాదు.

పార్లమెంట్ సెషన్స్ సమయంలోనే కాకుండా కేంపుల కెళ్లేటపుడు కూడా సూట్‌కేసు వుండాల్సిందే. అది వెంటలేకపోతే పాపాల పాపారావుకు తోచి చావదు. ఏదో పోగొట్టుకున్న వాడిలా ఫీలై పోయేవాడు.

పసితనంలోనే రాజకీయ జీవితానికి అతక్కు పోవటంతో చదువు అబ్బలేదు. ఏ భాషలోనైనా రాయటం... చదవటం రాదు. కానీ హిందీ అనర్గళంగా మాట్లాడగలడు. పెద్దల సాంగత్యంతో అలవాటైన కొన్ని కొన్ని ఇంగ్లీషు పడికట్టు పదాలు, ఉపన్యసించేటప్పుడు

వాటంతట అవే దొర్లుతుంటయ్!

కాలక్రమేణా పాపాల పాపారావుని 'సూట్‌కేస్ మినిస్టర్' అంటూ అందరూ పిలవటానికి అలవాటుపడ్డారు. అలా తనను అందరూ పిలుస్తుంటే అదేదో బిరుదు పొందిన వాడిలా తెగ మురుస్తూండటం అలవాటైంది.

తనకొచ్చే ఫైళ్లను పి.ఏ.ల చేత చదివించుకుని అర్థం చేసుకుని 'అవును-కాదు' అని రాసి పా.పా. అని పొట్టి సంతకం పెట్టటం నేర్చుకున్నాడు.

అదేమని ఎవరైనా ప్రశ్నిస్తే... రాజకీయాలకు చదువుతో పనేముంది?... అయినా పి.ఏ లున్నది దేనికి? మనకు సహాయపడటానికే కదాని నవ్వి ఎదుటివారి ఆక్షేపణలను కొట్టిపారేస్తుంటాడు.

పొట్ట పొడిస్తే అక్షరం ముక్కలేక (రాక), పోయినా పాలెటిక్స్‌లో మాత్రం అపర చాణుక్యుడు అందుకే పాపాల పాపారావు అంటే పార్టీలో అందరికీ ఎనలేని గౌరవం!

ఈ అరవై యేళ్లలో పాపాల పాపారావు ఎన్నికలలో ఎం.పి.గా పోటీ చేయకపోవటం గాని... గెలుపు సాధించలేక ఓడిపోవటం గాని జరగక పోవటం ప్రపంచ వింతల్లో ఒకటి!

ఏపార్టీ గెలిచినా మంత్రి పదవి అతడిని వరిస్తూనేవుంది. పరపతి పలుకుబడి పెరుగుతూనే వుంది. అదే పాపాల పాపారావు లోనున్న 'గ్రేస్' అండ్ 'గ్రేట్‌నెస్'!.

అధిష్టానానికి పాపాలపాపారావు అత్యంత ప్రీతి పాత్రుడు! విధేయుడు!

అత్యధిక సార్లు ఎన్నికల్లో పోటీచేసి గెలిచిన గెలుపుగుర్రమాయన! ఆయన కీర్తి బావుటా అటు తన ఇంటిమీద ఇటు పార్లమెంట్ భవనం మీద సర్వవేళ సర్వావస్తల యందూ రెపరెపలాడుతూటుంది.

★★★★★

సెంట్రల్లో పాపాల పాపారావ్‌గారి పలుకుబడి బెత్తెడు మందాన వుంది. ఆయన్ను సంప్రతించనిదే... అభిప్రాయం తీసుకోనిదే పార్టీ నిర్ణయం తీసుకోని లెవెల్‌కి ఎదిగాడు. ఆంజనేయుడు తన శరీరాన్ని ఏ విధంగానైతే అవసరాను గుణంగా పెంచుకోగలడో పాపాల పాపారావుగారి స్థాయి కూడా అంతకు మించి పెరగసాగింది.

అవినీతి అశుద్ధం చేతికి అతుక్కోకుండా అత్యంత జాగరూకత వహిస్తున్నాడు. ఆయనలో ధర్మరాజు హరిశ్చంద్రుడు ఇద్దరూ వూపిరి పోసుకుంటున్నారు.

కానీ... ఏళ్లు గడిచే కొద్దీ దేశరాజకీయాల్లో అనూహ్యమైన మార్పులు చేసుకో నారంభించినయ్! ఏ పార్టీలో చూచిన స్వార్థ చింతన ఎక్కువవుతూ వస్తోంది.

అవినీతి ఆశ్రిత పక్షపాతం ప్యాక్షనిజం, రౌడీయిజం పెచ్చరిల్లుతోంది.

చీకటి వ్యాపారం...నల్లడబ్బు రాజ్యమేలుతున్న దాన్పిస్తోంది. ద్రోహులు , దళారులు రంగ ప్రవేశం చేసి రాజకీయ రంగాన్ని కలుషితం చేయసాగారు.

మూడు విడతలు తాను ఎం.పి.గా ఎన్నికై మినిస్టర్ పదవి చేపట్టినపుడు కూడా తాను అవినీతి జోలికి పోలేదు.

సరిగ్గా అదే సమయంలో... అనగా మళ్లీ ఎన్నికలొచ్చి తాను నాల్గవ సారి ఎన్నికల బరిలో దిగి పోటీ చేయాల్సి వచ్చినపుడు..పార్టీ ఫండ్ కోసమో ఎన్నికల ఖర్చు కోసమో బడా వ్యాపారుల వద్ద... పారిశ్రామిక వేత్తల నుంచో పెద్ద ఎత్తున డబ్బు సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ప్రజలు తమ ఓట్లను డబ్బుకు అమ్ముకోవాలనే దురాశా ప్రబలింది.

మూడవ కోణంలో నుండి ఆలోచిస్తే డబ్బు తనకూ ఎంతగానో అవసరమన్పించసాగింది.

తనకా ముగ్గురు భార్యలు అధిక సంతానం! మడి కట్టుకుని కూర్చుంటే లాభం లేదన్పించింది. తన అవసరాలు తీరటం కోసం మార్గం అన్వేషించాల్సిన దయనీయ స్థితి ఏర్పడింది. ఆర్థిక సంకట పరిస్థితి నుండి తాను బైట పడాలి! ఎట్లా!

ఆడపిల్లల పెళ్లిళ్లు... మగ పిల్లల చదువులు... వీటి కోసం డబ్బు అవసరమైంది. అడ్డ దారులు తొక్కటం అవినీతిని కౌగిలించుకోవటం తప్పదన్పిస్తోంది.

తన పరువు ప్రతిష్ఠలను మంట గలిపి తన కుమార్తెల వివాహాలు, ఏ దోవనపోయే దానయ్యకో ఇచ్చి కట్టపెట్టి జరిపించలేడు!

ఆడపిల్లను అత్త వారింటికి తన స్థాయికి తగిన సంబంధం తెచ్చి సాగనంపాలంటే కట్నకానుకలు వివాహవేడుకకు ఖర్చుకోటి రూపాయలైన అవకపోదు.

తాను అరడజను మంది అల్లుళ్లను వెతుక్కోవలసిన పరిస్థితి. అలాంటప్పుడు తన అవసరాలు తీరటంకోసం దేహీ అంటూ వక్రమార్గాన ఆర్జించక తప్పదన్పిస్తోంది.

నీతి వాక్యాలు వల్లిస్తూ ఎన్నాళ్లిలా? దీపం వుండగానే చక్కదిద్దుకోవాలి! తప్పదు! రాజకీయాల్లో వుంటూ పదవుల్లో కొనసాగినన్నాళ్లే గౌరవం! ఆ తర్వాత తనముఖం ఎవరూ చూడరు సరికదా పది రూపాయలు అప్పుకూడా దొరకదనుకోవటం అతిశయోక్తి కానీ. ఆశ్చర్యం గానీ లేదన్పిస్తోంది అతగాడికి (సారీ మంత్రి వర్యులకు).

మగ పిల్లల్లో ఇద్దరు బడుద్దాయిలు! తనలాగే వారికీ చదువు వంట బట్టక పోవటంతో తిని బలాదూర్ తిరుగుతూ అసాంఘిక కార్య కలాపాల్లో పాల్గొనటం చూడలేక తండ్రి హృదయం విలపించింది.

ఆ ఇద్దరి పిల్లలకు ఒక దారి చూపాలనే ఆలోచన రాగానే తన పలుకుబడి వుపయోగించి ఒకరికి పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్ మరొకరికి కుకింగ్ గేస్ డీలర్ షిప్ ఇప్పించి పిల్లలిద్దరూ

గౌరవ ప్రదంగ బ్రతికే మార్గం కల్గించి తండ్రిగా తన బాధ్యత నెరవేర్చాడు.

మిగతా నలుగురు మగ పిల్లల విషయంలో పాపాల పాపారావ్ కి అసలు దిగుల్లేదు. వాళ్ల చదువులో ఎక్కొస్తూ ప్రొఫెషనల్ కోర్సులు చదవటానికి ఇష్టపడుతున్నారనే విషయం బోధపడింది.

రానూరానూ ఆర్థికంగా నిలదొక్కుకోగలుగుతున్నాడు. మూటలు పైవారికి అప్పగిస్తూ... కావలసినంత తనూ వెనకేసుకోవటానికి అలవాటుపడ్డాడు.

ఆ విధంగా అవినీతి ప్రబలటానికి తనవంతు ఆజ్యం పోస్తున్నాడు. సూట్‌కేస్ మినిస్టర్ పాపాల పాపారావు.

★★★★★

ఇన్నాళ్లలో ఏ పార్టీ దేశాన్ని పాలించినా... ఎందరు ప్రభుత్వ పాలన చేపట్టినా పేద ప్రజల పురోగతి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!

అక్షరాస్యతా కార్యక్రం సంపూర్ణంగా విజయవంతంకాకపోవటానికి ఎన్నో అవరోధాలు... ఎన్నెన్నో సమస్యలు కారణాలవటం దురదృష్టకరం!

బడుగు బలహీన వర్గాల... దారిద్ర్య రేఖకు దిగువనున్న వారి బతుకులు ఇన్నేళ్లయినా ఇంకా హీన స్థితిలో వుండటం విచారకరం!

కోట్లు ఖర్చుపెడుతున్నారనే గానీ ఫలితం ఆశించినంతగా వుండకపోవటం శోచనీయం. పథకాలు క్షేత్రస్థాయిలో వారికి చేరకుండా.. దళారులు... అవినీతిపరులు... అధికారవర్గం మింగేస్తున్నారనేది సర్వత్రా విన్పించే వాదన.

బాలకార్మికుల సమస్య నిర్మూలన దశకు చేరుకోవటంలో ఎవరూ తగినంత శ్రద్ధ తీసుకోవటం లేదనేది పచ్చి నిజం.

అందరికీ అన్నీ తెలుసు! ఎవ్వరూ ఏ విషయాన్నీ సీరియస్‌గా పట్టించుకుని పరిష్కార దిశగ పయనించటంలో కృతకృత్యులు కాలేకపోవటం అత్యంత బాధాకరం!

ఎన్నికలప్పుడు మాత్రం... పాదయాత్రలు నినాదాలు... వాగ్దానాలు... ఉపన్యాసాల్లాంటి వాటికి ప్రాముఖ్యత పెరుగుతుంది. నల్లడబ్బు అన్ని రాజకీయ పార్టీలూ గోనెసంచులతో కుమ్మరిస్తయ్. అక్రమాలకు అవినీతిపరులు తమ వంతు కర్తవ్యంగా భావించి ఇతోధికంగా వాటిలో పాలుపంచుకోవటం గమనార్హం!

నిరుద్యోగుల... వికలాంగుల... వృద్ధుల సంగతి సరేసరి! వీరి సమస్యలు ఎన్ని జన్మలకైనా తీరేవి కావు ఈ పవిత్ర భారతావనిలో...!

★★★★★

ముడుపుల ఉదంతం పార్లమెంట్‌లో భగ్గుమంది! లావాలా బ్రద్ధలైంది. ప్రతిపక్షాలు విరుచుకు పడినయ్. వ్యవహారం అవిశ్వాస తీర్మానం దాకా వెళ్లింది.

పాలక పార్టీ బిత్తరపోయి అనూహ్య పరిణామాలను ఎలా ఎదుర్కొనటమాని తీవ్రంగా ఆలోచించటం మొదలుపెట్టింది.

ఒకరిపై మరొకరు అభియోగాల బాణాలు సంధించుకున్నారు. దుమ్మెత్తి పోసుకున్నారు. దొంగలు దొరలు వాదులాటకి దిగారు. సూట్‌కేస్ మినిస్టర్ పాపారావ్ ముడుపుల వుదంతం ప్రముఖంగ చర్చనీయాంశమైంది.

తత్తర పాటుతో బిత్తరపోతున్నాడు పాపాల పాపారావ్. తాను నోరు విప్పక పోయినా ప్రతిపక్షాలు పాపారావు పాపాల చిట్టావిప్పి బుసలుకొడుతున్నాయ్?

తాను తిన్నదిపావలా వంతే... మిగతా మొత్తాలు కోట్లలో పార్టీ ప్రయోజనాలను అందించటం జరిగిందనే నిజం తనకుమాత్రమే తెలుసు! నింద తన మీదకే వచ్చింది. తాను నోరు విప్పలేడు. మాట్లాడితే ప్రభుత్వం కుప్పకూలిపోతుంది.

తాను బలిపశువు కాక తప్పదేమో అన్పిస్తోంది. పాపాల పాపారావుకి! ముడుపులు వ్యహారంతో తనకూ ఎంతో కొంత వాటావున్నదనే నిజాన్ని టోటల్‌గ కాదనే పరిస్థితి కాదు.

తనను కేసులోంచి బైట పడేయమని అదిష్ఠాన వర్గం కాళ్లమీద పడ్డాడు. కన్నీళ్లు పెట్టుకున్నాడు. కుడితిలో పడిన ఎలుకలా తయారైంది తన పరిస్థితి!

అయినా పైకి ఏమీఎరుగని వాడిలా గాంభీరంగాతన తప్పేమీ లేదని బుకాయిస్తున్నాడు.

పత్రికలన్నీ ఏకమై ఏకిపారేస్తున్నాయ్. టీ.వీ.లు వుతికి ఆరేస్తున్నాయ్.

మొత్తానికి అధికార పార్టీలో గందరగోళం నెలకొన్నది. తలలు పట్టుకుంటున్నారు. మంతనాలు సాగిస్తున్నారు.

ముడుపుల వ్యవహారమంతా అబద్ధమనీ తమపై అసత్యప్రచారం చేస్తూ... బురద చల్లటానికి చేస్తున్న ప్రయత్నంలో ఇదొక భాగమంటూ ఎదురు దాడికి దిగింది అధికార పార్టీ!

అనేక పర్యాయాలు 'క్లీన్ చిట్' అందుకున్న తనను ప్రతిపక్షాలన్నీ ఏకమై రచ్చకీడ్చటం అన్యాయమన్పించింది. అక్కడికి ఇతర పార్టీల వారు నీతిమంతు లైనటుట్టు విజృంభించటం చూస్తున్న పాపాల పాపారావుకు ఇక తన పని అయిపోయినట్టేనని మానసికంగా కృంగిపోతున్నాడు.

వేయి గొడ్లను తిన్న రాబందైనా సరే ఒక్క సుడిగాలికి కొట్టుకు పోతుందనే సామెత పాపాల పాపారావ్ తన పట్ల రుజువు కానున్నదేమోని భయపడి చస్తున్నాడు.

చివరికి అదిష్టానం తనను మంత్రి పదవికే కాకుండా సభ్యత్వానిక్కూడా ఎక్కడ రాజీనామా

చేయమంటుందోనని హడలి పోతున్నాడు.

అలాంటి పరాభవాన్ని తాను ఎదుర్కోవటం కంటే తనకు తానుగా రాజీనామా సమర్పించుకోవటమే శ్రేయోయకమన్పిస్తోంది.

మానసిక క్షోభ... చిత్రహింస తానుతట్టుకోలేక పోతున్నాడు. తనకా వయస్సు మీద పడింది? ఇప్పటి వరకు పార్టీలో కురువృద్ధుడుగా చెలామణి అవుతున్నాడు.

ఇక రాజకీయపరంగా ప్రతిపక్షాల తీవ్ర ఆరోపణలను ఎదుర్కోగల మనోధైర్యం శక్తి తనకు లేవన్పిస్తోంది.

సేవచేసినంతవరకు చాలు! ఆర్జించినంతవరకు తృప్తి పడితే రానున్న కాలం మనశ్శాంతితోనైనా ప్రశాంతంగా గడుస్తుంది. లేకుంటే వత్తిడి పెరిగి ఏ గుండె పోటోవస్తేతాను 'హరీ' అనక తప్పదు.

ప్రత్యక్ష రాజకీయాల్లోంచి తప్పుకోవాలనే నిర్ణయాని కొచ్చిన పాపాల పాపారావు అదిష్టానం 'ఛీ' కొట్టకముందే గౌరవంగా తప్పుకోవటం అన్ని విధాల మంచిదనే నిర్ణయానికొచ్చాడు.

నిజానికి ... తొంబై ఏళ్ళొచ్చినతనకు ఇంకా రాజకీయాలు దేనికన్పించింది? కుటుంబ భాధ్యతలన్నీ తీరిపోయినాయ్. తనకేబాధలేదు నిజానికి!

ఇన్నేళ్లుగా గడించిన కీర్తి పాపపు డబ్బు చాలన్పించింది.

మనిషే శాశ్వతం కానప్పుడు... ఇంకా మూటలు కట్టుకోవటం దేనికి? అనే వైరాగ్యం పాపాల పాపారావ్‌లో తొంగిచూసింది.

పదవికి పార్టీ సభ్యత్వానికీ తన రాజీనామా లేఖను ఫాక్స్ ద్వారా పంపిన పాపాల పాపారావు నిశ్చింతగా కాలుమీద కాలు... గుండెమీద చేయి వేసుకుని శేష జీవితాన్ని గడిపేటందుకే తీర్మానించుకున్నాడు.

-:(సమాప్తం):-